క్లుప్తంగా

జోరుగా ఆక్రమణల తొలగింపు



రైల్వేస్టేషన్ రోడ్డులో ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

విజయనగరం: స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని ఆక్రమణలను అధికారులు తొలగిస్తున్నారు. కాలువలను ఆక్రమించి చేసి నిర్మాణాలను ప్రొక్లెయినర్ సహాయంతో తీసేస్తున్నారు. నగర పాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాల మేరకు స్టేషన్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలు మంగళవారం తొలగించారు. ఆక్రమణదారులు కాలువలపై నిర్మాణాలు చేయడం వల్ల కాలువల్లో మురుగునీరు సక్రమంగా వెళ్లకపోవడానికి గల కారణాలు తెలియడం లేదని కమిషనర్ అన్నారు. కాలువలపై నిర్మాణాలు చేస్తే ఎక్కడ ఏ అడ్డంకి ఉందో ఎలా తెలుస్తుందన్నారు.

సబ్‌జైలు సందర్శన



సబ్‌జైలులో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి కృష్ణప్రసాద్

విజయనగరం లీగల్: నగరంలోని సబ్‌జైలును జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఖైదీలకు కల్పిస్తున్న వసతులను పరిశీలించి, పలు సూచనలు చేశారు. అనంతరం ఖైదీలతో సమావేశమై పలు చట్టాలు, వివిధ నేరాలకు పడే శిక్షలను తెలిపారు. ఖైదీలందరినీ సమానంగా చూడాలని, ఏ ఒక్కరిపై వివక్ష చూపొద్దని జైలు సిబ్బందికి చెప్పారు. ఖైదీలంతా మారు మనసు పొంది, నేర ప్రవృత్తిని వీడాలని కోరారు. జైలు నుంచి విడుదలైన తర్వాత ఆదర్శవంతమైన పౌరులుగా జీవించాలన్నారు. ఖైదీలకు సమయం ప్రకారం భోజనాలు పెట్టాలని, వారుండే గదులు శుభ్రంగా ఉండేలా చూడాలని సిబ్బందికి తెలిపారు.

క్రీడాదుస్తుల పంపిణీ



క్రీడాదుస్తులతో విద్యార్థులు

భోగాపురం: మండలంలోని తూడెం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు లోచర్ల రమణబాబు మంగళవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆయన తన గుర్తింపుగా విద్యార్థులకు క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు అప్పన్న చేతులమీదుగా విద్యార్థులకు వాటిని అందజేశారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు



అవగాహన కల్పిస్తున్న సీఐ రామకృష్ణ

నెల్లిమర్ల: ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని భోగాపురం సీఐ జి.రామకృష్ణ హెచ్చరించారు. స్థానిక పట్టణంలోని మిమ్స్ వైద్య కళాశాలలో ర్యాగింగ్ నిర్మూలనపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఎంబీబీఎస్ సీనియర్ విద్యార్థులను ఉద్దేశించి ఆయన కాసేపు మాట్లాడారు. జూనియర్లతో సీనియర్లు స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. ర్యాగింగ్ పేరుతో జూనియర్లను మానసికంగా, శారీరకంగా ఇబ్బందులకు గురిచేయవద్దన్నారు. విద్యార్థులంతా ఉన్నత లక్ష్యాలు ఏర్పర్చుకుని, వాటి సాధన దిశగా అడుగులు వేయాలన్నారు. ఎవరైనా ర్యాగింగ్ చేస్తే కళాశాల యాంటీ ర్యాగింగ్ కమిటీకి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ గణేష్, ప్రిన్సిపాల్ లక్ష్మీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

విజయనగరం క్రైమ్: విజయనగరానికి చెందిన ఓ యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. ఇదే నగరంలోని గంటస్తంభం వద్ద ఉన్న ఓ గాజుల షాపులో పనిచేస్తున్న యువతి ఎప్పటిలాగే షాపునకు వెళ్లి, తిరిగి ఇంటికి రాలేదని ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కనకరాజు కేసు నమోదు చేశారని, యువతి ఆచూకీ కోసం దర్యాప్తు చేస్తున్నామన్నారు. నగరానికి చెందిన ఓ తల్లి తన నాలుగేళ్ల కూతురితో కలిసి కనిపించకుండా పోవడంపై కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. బాబామెట్టలో నివాసముంటున్న ఆ తల్లి మే 3వ తేదీన తన బిడ్డను పట్టుకుని ఎక్కడికో వెళ్లిపోయినట్లు ఫిర్యాదుదారులు ఫిర్యాదులో పేర్కొన్నట్లు వెల్లడించారు. వారి ఆచూకీ కోసం దర్యాప్తు చేస్తున్నామన్నారు. నగరంలోని ఏడు కోవెల వద్ద నివాసముంటున్న ముంగర అవినాష్(36)ఆత్మహత్యకు పాల్పడినట్లు టూటౌన్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. అలాగే గాజులరేగలో పేకాట ఆడుతున్న 8 మందిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.21,370 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

హామీల అమలుపై నిలదీయాలి

- 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ'లో ఏపీ శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న మాజీ డిప్యూటీ స్పీకరు కోలగట్ల, నాయకులు

విజయనగరం: ఎన్నికల హామీల అమలుపై కూటమి నాయకులను నిలదీయాలని ఏపీ శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పిలుపునిచ్చారు. స్థానిక కార్పొరేషన్ పరిధిలోని 41వ డివిజన్‌లో మంగళవారం జరిగిన బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయనకు అక్కడి ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ బ్రోచర్లు పంపిణీ చేస్తూ ఏడాది కాలంగా హామీలన్నీ అమలు చేయకుండా ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మోసాలను వివరించారు. ఆ తర్వాత జరిగిన సభలో పాల్గొని, కూటమి పాలనపై మండిపడ్డారు. ఎన్నికల సమయంలో లేనిపోని హామీలిచ్చి, ఓట్లు అడిగిన నాయకులు ఇప్పుడు అడ్రస్ లేకుండా పోయారని, కనిపిస్తే ఎక్కడ నిలదీస్తారోనన్న భయంతో ప్రజల మధ్య తిరగడం లేదని విమర్శించారు. గతంలోని వైఎస్సార్ సీపీ హయంలో అధికారంలోకి వచ్చిన ఏడాదికే ఎన్నికల మేనిఫెస్టోలోని అన్ని హామీలు అమలు చేయడం జరిగిందని, ఆ విధంగా ఇప్పుడు ఎందుకు అమలు చేయలేకపోతున్నారని నిలదీశారు. అమలు చేయడం చేతకాని వారు హామీలు ఎందుకు ఇచ్చారన్నారు. హామీల అమలుకు సంబంధించి వారిచ్చిన బాండ్లతో వారిని ప్రశ్నించాలన్నారు. అధికారం కోసం అమలు సాధ్యం కాని హామీలిచ్చి, ఇప్పుడు వాటిని అమలు చేయకుండా కాలయాపన చేస్తుండడం మోసం కాదా అని ధ్వజమెత్తారు.

ఇచ్చిన పథకాల్లోనూ మోసమే..

ఇప్పటివరకు ఇచ్చి రెండు, మూడు పథకాల్లోనూ చాలామంది లబ్ధిదారులకు అన్యాయమే జరిగిందన్నారు. ఒక్కొక్కరికి ఒక్కో విధంగా పథకం, డబ్బులు ఇచ్చారని ఇది మోసం కాదా అని అన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చాలని, అంతవరకు ప్రజల తరపున వైఎస్సార్ సీపీ పోరాటం ఆగదన్నారు. గతంలోని వైఎస్సార్ సీపీ పాలనకు ఇప్పటి కూటమి పాలనకు ఉన్న తేడాను ప్రజలు గమనిస్తున్నారని, వారే రాబోయే రోజుల్లో తగిన బుద్ధి చెబుతారన్నారు. నిరుపేదల కోసం చేపడుతున్నామని చెబుతున్న పీ4 సర్వే, మార్గదర్శి-బంగారు కుటుంబం కార్యక్రమాలు ధనికులకు మేలు చేకూరేలా జరుగుతున్నాయని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు శెట్టి వీరవెంకటరాజేష్ ఆరోపించారు. కూటమి మోసాలను ప్రజలు గుర్తించాలని కోరారు. అనంతరం పార్టీ వార్డు అధ్యక్షుడిగా కాసీం, బీసీ విభాగం అధ్యక్షుడిగా సురేష్‌లను నియమించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగంరెడ్డి బంగారునాయుడు, కార్పొరేటర్ ఎస్.నారాయణస్వామి, నాయకులు అవనాపు లక్ష్మణరావు, రెడ్డి గురుమూర్తి, తాళ్లపూడి గణేష్, బొబ్బాది త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

కూటమిది కుట్రపూరిత రాజకీయం..

విజయనగరం కార్పొరేషన్ పరిధిలోని 15వ డివిజన్‌లో జరిగిన బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమంలో మేయర్, డిప్యూటీ మేయర్‌లు వెంపడాపు విజయలక్ష్మి, కోలగట్ల శ్రావణిలు పాల్గొని, కూటమి కుట్రలు, మోసపూరిత పాలనను ఇంటింటికీ వెళ్లి వివరించారు. కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అరాచక పాలన చేస్తోందని విమర్శించారు. ఎక్కడ చూసినా రక్తపాతమే సృష్టిస్తోందన్నారు. ప్రభుత్వ తప్పులు, కూటమి నాయకుల మోసాలు, అన్యాయాలు, అక్రమాలపై ప్రశ్నిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా యాక్టివిస్టులపై దాడులు చేయిస్తోందని, కేసులు పెట్టిస్తోందని మండిపడ్డారు. కడప జిల్లా జెడ్పీటీసీ ఉపఎన్నికల్లో కుర్చీ కోసం కూటమి ఎంతలా దౌర్జన్యం చేస్తుందో రాష్ట్ర ప్రజానీకం మొత్తం చూస్తోందన్నారు. అధికారంలో ఉంటే ఏమైనా చేయొచ్చు..ఏం చేసినా చెల్లుతుందనే విధంగా కూటమి నాయకులు విర్రవీగుతున్నారని, వారి అరాచకాలకు ప్రజలే అడ్డుకట్ట వేస్తారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అల్లు చాణిక్యలు పాల్గొన్నారు.



కొత్తపేటలో కూటమి మోసాలు వివరిస్తున్న మేయర్, డిప్యూటీ మేయర్‌లు విజయలక్ష్మి, శ్రావణి



రైల్వేజోన్ గెజిట్ విడుదల చేయాలి

కొత్త రైల్వేజోన్ గెజిట్ నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలంతా విజయనగరం రైల్వే స్టేషన్ ఎదుట మంగళవారం నిరసన చేపట్టారు. విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వేజోన్ ఏర్పాటుకు కేంద్రం ముందుకువచ్చిందని, 2025 జనవరి 8వ తేదీన ఈ కొత్త రైల్వేజోన్‌కు ప్రధాని మోదీ శంకుస్థాపన కూడా చేశారని గుర్తు చేశారు. ఇదంతా జరిగి 8 నెలలు దాటుతున్నా ఇప్పటివరకు రైల్వేజోన్ గెజిట్ విడుదల చేయకపోవడం విచారకరమన్నారు. అక్టోబరు 2 నాటికి(గాంధీ జయంతి) అయినా దక్షిణ కోస్తా రైల్వేజోన్ స్వతంత్ర కార్యాకలాపాలు జరిగేలా చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ఎ.నాగభూషణం, ఆర్.పద్మావతి, టి.రాజారావు, పి.అప్పారావు, ఎస్.శ్రీను తదితరులు పాల్గొన్నారు. –విజయనగరం గంటస్తంభం

కాల పరిమితిలో అభియోగ పత్రాల దాఖలు

- జూమ్ కాన్ఫరెన్స్‌లో ఎస్పీ ఆదేశాలు



పోలీస్ అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందల్, చిత్రంలో ఏఎస్పీ సౌమ్యలత

విజయనగరం క్రైమ్: పోలీస్‌స్టేషన్లలో నమోదైన క్రిమినల్ కేసుల్లో దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేసి, కొత్త చట్టాలకు అనుగుణంగా నిర్దిష్ట కాల పరిమితిలో నిందితులపై సంబంధిత న్యాయ స్థానాల్లో అభియోగ పత్రాలు దాఖలు చేయాలని ఎస్పీ వకుల్ జిందల్ సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు డీపీఓలోని తన చాంబర్ నుంచి మంగళవారం జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న ఎస్సైలు, సీఐలు, డీఎస్పీలతో ఎస్పీ జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కొత్త క్రిమినల్ చట్టాలకు అనుగుణంగా 10 ఏళ్ల కంటే ఎక్కువగా శిక్షలు విధించే క్రిమినల్ కేసుల్లో 90రోజుల్లోను, అంతకంటే తక్కువ కాలం శిక్షలు విధించే కేసుల్లో 60రోజుల్లోగా నిందితులపై సంబంధిత న్యాయ స్థానాల్లో అభియోగ పత్రాలు దాఖలు చేయాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో దర్యాప్తులో గల గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులను ఎస్పీ సమీక్షించి, ఆయా కేసుల్లో దర్యాప్తు పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. వివిధ కేసుల్లో దర్యాప్తు పెండింగ్‌లో ఉండడానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకుని, దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేసి, అభియోగ పత్రాలు దాఖలు చేయాలని సూచించారు.

న్యాయస్థానాలకు వెళ్లి పరిశీలించాలి

అలాగే పోక్సో కేసుల్లో బాధితురాలి వయస్సును నిర్ధారించేందుకు ఇకపై పంచాయతీ, మున్సిపల్ ఆఫీసుల నుంచి జారీ చేసిన నిర్ధారణ పత్రాలను మాత్రమే ప్రామాణికంగా తీసుకోవాలన్నారు. న్యాయస్థానాల్లో ప్రాసిక్యూషన్ పూర్తిచేసేందుకు ఈసమన్స్ త్వరితగతిన అమలు చేయాలన్నారు. దర్యాప్తు అధికారులు తరచూ న్యాయ స్థానాలకు వెళ్లి, ప్రాసిక్యూషన్ సక్రమంగా జరుగుతున్నదీ లేనిదీ, నిందితులు కోర్టుకు సక్రమంగా హాజరవుతున్నదీ లేనిది పరిశీలించాలని స్పష్టం చేశారు. నిందితులకు శిక్ష పడేలా సాక్ష్యాలను దాఖలు చేయాలని, సాక్షులు వారి సాక్ష్యాన్ని న్యాయ స్థానాల్లో చెప్పే విధంగా చూడాలని అధికారులను ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు. జూమ్ కాన్ఫరెన్సులో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, బొబ్బిలి డీఎస్పీ జి.భవ్యరెడ్డి, చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు, విజయనగరం వన్ టౌన్,టూటౌన్ సీఐలు ఆర్వీఆర్కే చౌదరి, శ్రీనివాస్‌లతో పాటు ఎస్సైలు దామోదర రావు, అశోక్ ఇతర సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న బ్యాంక్ మేనేజర్లు

పూసపాటిరేగ: ఆర్థిక అక్షరాస్యతపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్‌బీఐ(స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా) మేనేజరు మురళి తెలిపారు. స్థానిక ఎస్‌వీఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో ఆర్థిక అక్షరాస్యులుంటే మన భవిష్యత్, దేశ భవిత బాగుంటుందన్నారు. యూనియన్ బ్యాంక్ మేనేజర్ రామునాయుడు మాట్లాడుతూ సైబర్ నేరాల బారి నపడకుండా జాగ్రత్తపడాలని, డిజిటల్ చెల్లింపుల్లోనూ అవగాహన కలిగి ఉండడం అవసరమన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌టీ(సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్ మిషన్) డైరెక్టర్ ఆంజనేయులు, డీసీసీబీ మేనేజర్ శ్రీలత, పంజాబ్ నేషనల్ బ్యాంక్ మేనేజర్ ఎర్రాజీరావు తదితరులు పాల్గొన్నారు.

'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ



ర్యాలీలో జాతీయ జెండాలతో వెలుగు శాఖ అధికారులు, సిబ్బంది, సభ్యులు

భోగాపురం: దేశ స్వాతంత్ర్య దినోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ మంగళవారం నిర్వహించారు. వెలుగు శాఖ అధికారులు , వెలుగు సమాఖ్య సభ్యులంతా ఈ ర్యాలీలో పాల్గొని, భారత మాతాకీ జై అని నినాదాలు చేశారు. ఈ నెల 15వ తేదీన ప్రతిఒక్కరూ స్వాతంత్ర్య దినోత్సవం ఘనంగా జరుపుకోవాలని కోరారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి, దేశభక్తి చాటుకోవాలన్నారు. అనంతరం స్వయం సహాయక సంఘ సభ్యులు ప్రదర్శించిన వ్యవసాయ, ఆహార ఉత్పత్తులను సందర్శించి, వారి ఆదాయ, వ్యయాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారి స్వయం ఉపాధి మెరుగుకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా టూరిజం శాఖ అధికారి కుమారస్వామి, తహసీల్దార్ ఎం.రమణమ్మ, ఎంపీడీవో కె.గాయత్రి, ఏవో కామేశ్వరరావు, ఏపీవో భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న తహసీల్దారు శ్రీకాంత్, తదితరులు

నెల్లిమర్ల: స్వాతంత్ర్య దినోత్సవం రోజున ప్రతి ఇంటిపైనా జాతీయ జెండా ఎగురవేయాలని తహసీల్దార్ శ్రీకాంత్ పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి హర్ ఘర్ తిరంగా ర్యాలీ చేపట్టారు. ఈ నెల 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవాన్ని పండగ వాతావరణంలో చేసుకోవాలని ఎంపీడీవో కోరారు. అనంతరం డ్వాక్రా మహిళలు ప్రదర్శించిన వ్యవసాయోత్పత్తులను సందర్శించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీవో సుదర్శనం తదితరులు పాల్గొన్నారు.

పుష్పాలంకరణలో పైడితల్లి



పుష్పాలకరణలో భక్తులకు దర్శనమిస్తున్న చదురుగుడి పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్:

ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం భక్తులకు పుష్పాలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజామునుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు చేశారు. సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, నేతేటి ప్రశాంత్‌లు శాస్త్రోక్తంగా నిత్య పూజాదికాలు చేశారు. ఆలయం వెనుక ఉన్న వేప, రావిచెట్ల వద్ద దీపారాధన చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

కార్మికుల సంక్షేమానికి మరింత పర్యవేక్షణ అవసరం

- జిల్లా న్యాయ సేవల అధికార సంస్థ కార్యదర్శి



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణ ప్రసాద్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

విజయనగరం లీగల్: వెట్టి చాకిరీ నిర్మూలనకు క్షేత్ర స్థాయిలో అధికారుల పర్యవేక్షణ మరింత అవసరమని జిల్లా న్యాయ సేవల అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎ.కృష్ణ ప్రసాద్ అన్నారు. జిల్లా న్యాయ సేవల అధికార సంస్థ, నేచర్ సంస్థల ఆధ్వర్యంలో అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమానికి, అభివృద్ధికి నేషనల్ లీగల్ సర్వీస్ అథారిటీ గైడ్‌లైన్స్‌ పై మంగళవారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసంఘటిత కార్మికులకు సహకరించే చట్టాలపై వారికి అవగాహన కల్పించడంతో పాటు వారి హక్కులు కాపాడుకోవడానికి అవసరమైన సహాయ సహకారం అందించనున్నట్లు తెలిపారు. అలాగే వెట్టిచాకిరీ నిర్మూలనకు సంబంధిత శాఖ అధికారులందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్మిక శాఖ సహాయ కమిషనర్ రమాదేవి మాట్లాడుతూ ఫిబ్రవరి 9న వెట్టిచాకిరీ నిర్మూలన దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. వెట్టిచాకిరీ విముక్తికి అనేక చర్యలు తీసుకుంటున్నామని, అటువంటివారికి షెల్టర్ ఏర్పాటు చేయడంతో పాటు ఆర్థికంగా కూడా రూ.35వేలు సహాయం అందించనున్నట్లు తెలిపారు. చైల్డ్ రైట్స్ ఫోరం కన్వీనర్ పి.చిట్టిబాబు మాట్లాడుతూ అసంఘటిత కార్మికులు పనిచేసే చోట అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. జిల్లాలో అనేక చోట్ల బాల కార్మికులు ఉన్నారని పేర్కొన్నారు. డెంకాడ, రామభద్రపురం, రంగరాయపురం ప్రాంతాలలో 32 కేసులు నమోదయ్యాయన్నారు. విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ అనేక ఆర్థిక కారణాల వల్ల తల్లిదండ్రులు పిల్లలను పనుల్లోకి పంపుతున్న పరిస్థితి ఉందన్నారు. సమావేశంలో డీసీపీ అసిస్టెంట్ డైరెక్టర్ బి.రామకృష్ణ పాల్గొన్నారు.

ఆల్బెండజోల్‌తో..నులిపురుగులు నులిమేద్దాం!

జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం పురస్కరించుకుని, పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ మంగళవారం చేపట్టారు. ఏడాది నుంచి 19 ఏళ్ల వయసు వారందరికీ ఈ మాత్రలు అందించి, వారితో వేయించారు. ఈ మాత్రలు వేసుకోవడం ద్వారా నులిపురుగులను నిర్మూలించవచ్చని, ఒకటి, రెండేళ్ల వయసు వారు అరముక్క, రెండేళ్ల వయసు దాటిన వారంతా పూర్తి మాత్ర వేసుకోవాలని వైద్యారోగ్య సిబ్బంది తెలిపారు.

-విజయనగరం, డెంకాడ, పూసపాటిరేగ



డెంకాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల నోట్లో మాత్రలు వేస్తున్న ఎంపీపీ వాసుదేవరావు



పూసపాటిరేగ: రెల్లివలసలో విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలు వేయిస్తున్న వైద్యాధికారి రాజ్‌కుమార్



విజయనగరం కంటోన్మెంట్ పాఠశాలలో విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలు మింగిస్తున్న నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య



నెల్లిమర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలు మింగిస్తున్న నగరపంచాయతీ చైర్‌పర్సన్ సరోజిని

ఉపఎన్నిక నిర్వహణకు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఖాళీగా ఉన్న కార్పొరేటర్ స్థానాలకు ఉపఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. ఇదే విషయమై నగరంలోని తన కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులతో మంగళవారం సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పలు కారణాల వల్ల ఖాళీ అయిన నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాల్లోని 55 కార్పొరేటర్లు, కౌన్సిలర్ల పదవులకు గాను సెప్టెంబర్ 17వ తేదీలోగా ఉపఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు చేస్తోందన్నారు. విజయనగరంలోని 34వ డివిజన్‌లో కార్పొరేటర్ బాలి పైడిరాజు మరణంతో ఆ స్థానం ఖాళీగా ఉందని, అదే స్థానానికి ఉపఎన్నిక జరుగుతుందన్నారు. ఈ మేరకు ఓటర్ల జాబితా రూపొందించి, ప్రచురించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. సమావేశంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న డీఎస్పీ గోవిందరావు

విజయనగరం క్రైమ్: చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని స్థానిక మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ గోవిందరావు సూచించారు. నగరంలోని ఎంఎస్ఎన్ జూనియర్ కళాశాలలో మాదకద్రవ్యాలు వల్ల కలిగే దుష్ప్రభావాలు, పోక్సో చట్టం, ఈవ్‌టీజింగ్, శక్తియాప్ తదితర అంశాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ భద్రత కోసం తమ ఫోన్లలో శక్తియాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. గంజాయి, ఖైనీ, గుట్కా, కొకైన్, హెరాయిన్, మద్యం, సారా వంటి మత్తు పదార్థాల వల్ల అనేక దుష్ప్రభావాలు కలుగుతాయని, వాటి బారినపడి ఎంతోమంది జీవితాలు నాశనం చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే మైనర్ బాలికలను లైంగిక వేధింపులకు గురిచేస్తే పోక్సోచట్టం ప్రకారం శిక్షలు తప్పవన్నారు. గంజాయి వినియోగిస్తున్నా, విక్రయించినా టోల్‌ఫ్రీ నంబర్లు 100 లేదా 112లను గానీ 1972కు గానీ ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మహిళా పీఎస్ ఎస్ఐ జి.శిరీష, వన్‌టౌన్ ఎస్ఐ బి.దేవి తదితరులు పాల్గొన్నారు.